## క్లుప్తంగా

### పుస్తకాలు సకాలంలో అందించాలి

భూపాలపల్లి అర్బన్: ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలల విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణారెడ్డి, తిరుపతిలు ఆదివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతీ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత రెండు, మూడు నెలల వరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందడం లేదన్నారు. ఇంకో నెల రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.

### రానున్న రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారం

కన్నాయిగూడెం: రానున్న రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారమని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు తెలంగాణలో పునరావృత్తం అవుతుందన్నారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### పరామర్శించకపోవడం విచారకరం

పరకాల : ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న హైబోతుపల్లి సర్పంచ్ కంచ కుమారస్వామి కుటుంబాన్ని 15 రోజులు అవుతున్నా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించకపోవడం విచారకరమని వైఎస్సార్‌టీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపల్లి మల్లేషం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కంఠాత్మకూర్ సర్పంచ్ కొమురయ్య, కామారెడ్డిపల్లె సర్పంచ్ దొమ్మటి ఎల్లస్వామి అనారోగ్యంతో, అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ కంచ వరలక్ష్మి భర్త కుమారస్వామి రోడ్డు ప్రమాదంలో చనిపోతే వారి కుటుంబానికి మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్థికంగా అండగా నిలవటం జరిగిందన్నారు. మాజీ మంత్రి కొండా సురేఖ చొరవతో ఆదుకోవడం జరిగిందన్న ఆయన ఓ యువ సర్పంచ్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటే ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆర్థికంగా ఆదుకోకపోయినా పలుకరించకపోవడంపై తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

నడికూడ : రోడ్డు ప్రమాదాలకు నివారణ వరంగల్ పోలీస్ కమిషనర్ సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు స్థానిక కిషన్ తెలిపారు. సెక్టార్ ఎస్సైలు ప్రశాంత్‌బాబు, హరికృష్ణ, శివకృష్ణ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు అయిన కాకొండ క్రాస్ రోడ్డు, ధర్మారం, వెల్లంపల్లి క్రాస్ రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదలను, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికించారు.

### మైనారిటీల సంక్షేమానికి కృషి

దామెర: మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తానని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్ అలీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ముస్లిం రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎంఆర్‌పీఎఫ్) సభ్యులు ఆయన నివాసంలో కలిశారు. మైనారిటీ కమ్యూనిటీ భవనాలు, రెసిడెన్షియల్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మహమ్మద్ అజీజ్, డాక్టర్ రాజే మహ్మద్, నయీముద్దీన్ ఉన్నారు.

# అద్దె భవనంలో గ్రంథాలయం

**ఇబ్బందులు పడుతున్న పాఠకులు**
- పట్టించుకోని పాలకులు, అధికారులు


అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

మొగుళ్లపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు. నిరుద్యోగులకు యువకులకు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయి. కానీ పాలకుల పట్టింపులేనితనమో, అధికారుల నిర్లక్ష్యమోగానీ ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో మండల కేంద్రంలోని గ్రంథాలయం కొనసాగుతోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని పాఠకులు వాపోతాతున్నారు. ఒకే సారి చాలా మంది వస్తే ఆరుబయట నిలబడల్సిన పరిస్థితి. గ్రంథాలయంలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని మండిపడుతున్నారు.

**దినపత్రికలకే పరిమితం..**

గతంలో గ్రామ పంచాయతీ భవనంలోనే గ్రంథాలయం కొనసాగినుప్పుడు కొన్ని పుస్తకాలైనా ఉండేది. కానీ అద్దెభవనంలోకి వచ్చినప్పటి నుంచి కేవలం రెండు, మూడు దినపత్రికలు మాత్రమే ఉంటున్నాయని వార పత్రికలు, మాస పత్రికలు నవలలు కాని లేవని పాఠకులు అంటున్నారు. యువతి, యువకులు పోటీ పరీక్షలకు కావాల్సినా సమాచారంతో పాటు విద్యా, ఉద్యోగ సమాచారం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం లేవగానే సమాచారం కోసం ప్రజలు గ్రంథాలయాలకు పరుగులు తీస్తారు. అలాంటి గ్రంథాలయాలకు ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించకుండా చిన్న చూపు చేస్తున్నాయని పాఠకులు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామీణ మండల కేంద్రాల్లో ఉన్న గ్రంథాలయాల్లో సరైన పుస్తకాలు ఉండకపోగా అభివృద్ధికి నోచుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు చొరవ చూపి గ్రంథాలయానికి పక్కాభవనం నిర్మించడంతో పాటు కావాల్సినా సమాచారం లభించే విధంగా పుస్తకాలు నవలలు ఉండే విధంగా కృషి చేయాలని మండలంలోని పాఠకులు కోరుతున్నారు.

**భవనం నిర్మించాలి**



మండల కేంద్రంలోని గ్రంథాలయంలో కేవలం ఒకటి రెండు వార్త పత్రికలు మాత్రమే ఉంటున్నాయి. నవలలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవు. పాఠకులకు అనువుగా ఉంటే విధంగా పక్కా భవనం నిర్మించి పుస్తకాలను అందుబాటులో ఉంచాలి.

- సురేందర్, మొగుళ్లపల్లి

# ప్రజలు సంతోషంగా ఉండాలి


చిట్యాల: విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న సత్యనారాయణరావు

చిట్యాల: ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆంజనేయస్వామి వేడుకున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని లక్ష్మిపురం తండాలో శ్రీ అభయాంజనేయ స్వామి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పుజాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహణ కమిటీ ప్రతినిధులు సత్యనారాయణరావును శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ జవహర్ లాల్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

**బొడ్రాయి వేడుకల్లో..**

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లిలో కొనసాగుతున్న భూలక్ష్మీ-మహాలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆదివారం హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొన్నం కోమలచంద్రయ్య, ఉప సర్పంచ్ దేశెట్టి గోపాల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొన్నం భిక్షపతిగౌడ్, తదితరులు ఉన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

మహదేవపూర్: మండల పరిషత్ కార్యాలయంలో నేడు(సోమవారం) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్రనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ రాణీబాయి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు. అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలలో 2007-08 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందాలను పంచుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని ఎంతో మందికి ఆదర్శంగా నిలువాలన్నారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, భాస్కర్, ధర్మారావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకలు


కాళేశ్వరం: పూజలో పాల్గొన్న భక్తులు


మహాముత్తారంలో..


ఏటూరునాగారంలో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి అనుబందదేవాలయమైన గుండం చెరువు కట్టమీద హనుమాన్ ఆలయంలో ఆదివారం హన్‌మాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు తరలివచ్చారు. హనుమాన్ మాల ధరణ భక్తులు తెల్లవారుజామున త్రివేణి సంగమంలో విరమణ చేశారు. దీంతో ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, ధర్మకర్తలు కలికోట దేవేందర్, అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, దేవుడ శ్యాంసుందర్, కుంభం పద్మ, ప్రశాంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

**హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన**

మహాముత్తారం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం హన్‌మాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. పూజారి కాగితపు వెంకటేష్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విమల పూల్‌సింగ్ పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పండ్లతో స్వామివారిని అలంకరించి, ప్రత్యేక పూజలతో హనుమాన్ చాలీసా పఠించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, పూజారులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు ప్రాంతంలో కొలువై ఉన్న భక్తాంజనేయస్వామి, ఓడవాడలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకాలను అర్చకులు యల్లప్రగడ సూర్యనారాయణశర్మ, మణిశర్మ, రామ్మూర్తి శర్మ, శ్రీకాంత్ చేపట్టారు. క్రాస్‌రోడ్డు ఆంజనేయస్వామి ఆలయంలో వంగమూరి శివలింగప్రసాద్ కుమారులు హర్షవర్ధన్, గౌతమ్, ఉమారాణిల ఆధ్వర్యంలో అన్నదాన, పూజ కార్యక్రమాలు చేశారు. అష్టోత్రనామాలు, పుష్పాభిషేకం, నూతనవస్త్ర అలంకరణ, పూలమాలను స్వామికి అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంజనేయస్వామి మాల ధారులు విరమణ చేసి స్వామిని దర్శించుకున్నారు.

**ప్రత్యేక పూజలు**

హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక సీఐ మండల రాజు, ఎస్సై రమేష్, సర్పంచ్ రామ్మూర్తి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు క్రాస్‌రోడ్డులోని ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై రమేష్, సర్పంచ్ రామ్మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందగట్ల రమేష్, అంగాల వీరన్న, పానేం సాంబశివరావు, రాందాస్ కార్తీక్, గుంత రమేష్, సోమందపు నరసింహులు, గార మహేష్, చందు, అంబరికాని సాయికుమార్, బోట తిరుపతమ్మ, కర్ల పవన్ కళ్యాణ్, అంకని ముత్తేష్, గార మహేష్, క్రాస్‌రోడ్డు యూత్ సభ్యులు సురేష్, రవీంద్రనాథ్‌టాఘూర్, వద్ది నరేష్, గిరి, సారయ్య పాల్గొన్నారు.

వాజేడు: మండల కేంద్రంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన భక్తజన బృందం కమిటీ ఈ వేడుకలను చేపట్టారు. హనుమాన్ సెంటర్లో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహానికి పాలాభిషేకం చేసి స్వామి వారికి శాస్త్రోక్తంగా పత్ర, ఫల, పుష్పాలతో విడివిడిగా పూజలను అర్చకులు సౌమిత్రి వేణుగోపాలా చార్యులు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అభిషేకాలను చేయించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

వెంకటాపురం(కె): మండలంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. మండల పరిధిలోని ఆలుబాక, చొక్కాల, వెంకటాపురం మండల కేంద్రంలోని శివాలయం సమీపంలోని హనుమాన్ టెంపుల్, పెరిక బజారులోని మంగపేట గోదావరికి వెళ్లే రహదారి సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద జయంతి వేడుకలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టారు. వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు చలువ పందిల్లు, తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డర్రా దామోదర్, మడుగూరి సత్యనారాయణ ఉన్నారు.

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆయా ఆలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజారులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కమలాపురం ఆంజనేయస్వామిని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ దర్శించుకుని ఆలయానికి ఫ్యాన్ బహూకరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా రాజుపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ భక్తుల ఇరుముడి దారణ కార్యక్రమం జరిగింది. రాజుపేట, టీకొత్తగూడెం ఆంజనేయస్వామి ఆలయాల్లో దాతల సాయంతో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

# నాంచారమ్మకు ప్రత్యేక పూజలు


నాంచారమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న రాజు

వెంకటాపురం(ఎం): నాంచారమ్మతల్లి దీవెనతో ప్రజలంతా క్షేమంగా ఉండాలని నాంచారమ్మ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు అన్నారు. ఆదివారం మండలంలోని రామానుజపురం గ్రామ సమీపంలో ఎరుకల నాంచారమ్మ (పంచ కూటాలయం)లో తిరుగువారం జాతరకు ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు హాజరై నాంచారమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేతిరి భిక్షపతి, పల్లకొండ భాస్కర్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకతీయుల కాలంలో నిర్మించబడిన ఎరుకల నాంచారమ్మ ఆలయాన్ని పునర్నిర్మించడంలో ప్రభుత్వాలు చిన్న చూపు చూడడం తగదన్నారు. ఐదు రాష్ట్రాల నుంచి ప్రతి ఏటా తరలివచ్చే ఎరుకల కులస్తుల కోసం కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. జాతర వైభవంగా నిర్వహించేందుకు, నాంచారి విగ్రహ ప్రతిష్ఠ చేసేందుకు ప్రభుత్వం, పురావస్తుశాఖ, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చొరవతో నాంచారమ్మ జాతర వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజు, ములుగు జిల్లా గౌరవ అధ్యక్షుడు కేతిరి సారయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, కరీంనగర్ జిల్లా కన్వీనర్ కూతాటి శ్రీనివాస్, సదానందం, గంగయ్య, పాలకుర్తి సురేష్, కెంసారం రాజు, కేతిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### దగ్ధమైన పంట పరిశీలన


దగ్ధమైన పంటను పరిశీలిస్తున్న ప్రవీణ్

ములుగు రూరల్: ములుగు మండలంలోని అబ్బాపురం శివారులో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన వరి పంటను బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ పరిశీలించారు. వ్యవసాయ అధికారులు, తహసీల్దార్‌తో మాట్లాడి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా విజ్ఞప్తి చేస్తానని అన్నారు. ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు విజరాంనాయక్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జ్ మహేశ్, రాజా హుస్సేన్, రైతులు సమ్మిరెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

### పోడు పట్టాల పంపిణీకి సిద్ధం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోడు భూమి రైతులకు ఈనెల చివర్లో పట్టాల పంపిణీ ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా పోడు భూములను సాగు చేస్తున్న గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. 3,371మంది రైతులకు గాను 7,333ఎకరాల విస్తీర్ణంలో పట్టాల ముద్రణ పూర్తయిందని, 360మంది రైతుల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్టీయేతర కులాల సర్వే పూర్తయిందని, వీటికి సంబంధించి ప్రభుత్వం హద్దులు నిర్ణయించినట్లు తెలిపారు. బీసీ, ఇతర కులాల పట్టాలపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

# వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పుట్ట మధు, జక్కు రాకేశ్, నాయకులు

కాటారం: పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంథనిలో ఈ నెల 16న నిర్వహించనున్న ఓబీసీ రిజర్వేషన్ పితామహుడు మాన్యశ్రీ బిందేశ్వర ప్రసాద్ మండల్ విగ్రహావిష్కరణ మహోత్సవ పోస్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. పుట్ట మధు జన్మదినాన్ని పురస్కరించుకొని బిందేశ్వర ప్రసాద్ మండల్ విగ్రహావిష్కరణ మహోత్సవం చేపట్టనున్నట్లు మండల అధ్యక్షుడు తోట జనార్ధన్, యూత్ సబ్ డివిజన్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు, పుట్ట అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జక్కు రాకేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, దబ్బెట రాజేశ్, ఊర వెంకటేశ్వర రావు, నరివెద్ది శ్రీనివాస్, చీమల వంశీ, శ్రీశైలం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలిమెల: ఈనెల 16న పెద్దపల్లి చైర్మన్ పుట్ట మధుకర్ జన్మదినం సందర్భంగా పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల పితామహుడు మాన్యశ్రీ బిందేశ్వరి ప్రసాద్ మండల్ విగ్రహాన్ని మంథనిలో ఆవిష్కరించనున్నట్లు బీఆర్ఎస్ పలిమెల మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి తెలిపారు. విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభకు మండలంలోని ప్రజలు హాజరు కావాలని కోరారు. విగ్రహ ఆవిష్కరణకు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

# విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ

- 15రోజులుగా సమ్మర్ క్యాంప్ నిర్వహణ
- నేటితో ముగింపు


ఏహెచ్ఎస్‌లో యోగాను నేర్పిస్తున్న ట్రైనర్ రాంబాబు

ఏటూరునాగారం: వేసవిలో గిరిజన విద్యార్థులు వారికి ఉన్న ప్రతిభను మరింత మెరుగుపర్చాలనే ఉద్దేశంతో వంద మంది గిరిజన విద్యార్థినులకు ప్రత్యేక సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సమ్మర్ మీట్ 2023 క్యాంప్‌ను మే 1న ప్రారంభించారు. కాగా, ఈ క్యాంప్ నేడు(సోమవారం) ముగుస్తుంది. ఇందులో గిరిజన బాలికలు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. చదువుతో కుస్తి పడుతూ పుస్తకాలలోనే మెదులుతున్న వారికి ఆహ్లాదం, ఏకాగ్రత, మానసిక శక్తి పెంచాలనే ఉద్దేశంతో ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు.

**ప్రత్యేక శిక్షణలు**

ఐటీడీఏ ద్వారా చేపట్టిన సమ్మర్ సమ్మిట్ 2023 శిబిరంలో కో-స్కాలస్టిక్ యాక్టివిటీస్, కంప్యూటర్ బేసిక్స్-స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్-క్రాఫ్ట్, లిటరసీ యాక్టివిటీస్ (వ్యాస రచన, వకత్వం, కథా రచన, కథా కథనం) పాడటం పద్యాలు, స్పెల్ బీ, డ్యాన్స్, పాటలు-సాంస్కతిక కార్యకలాపాలు, కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, మెహందీ మేకింగ్-హ్యాండ్స్‌పై డిజైన్ చేయడం, ఆటలు క్రీడలు, యోగా నేర్పించారు. పదిహేను రోజుల పాటు విద్యార్థినుల్లో ఎంతో మానసికోల్లాసాన్ని పెంచారు. వరంగల్, ములుగు, భూపాలపల్లి, జనగాం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన విద్యార్థినులు ఇక్కడ శిక్షణ పొందారు. అనుభవం ఉన్న రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులను ఇక్కడ ట్రైనర్స్‌గా ఏర్పాటు చేశారు. క్యాంప్‌ను ఐటీడీఏ పీఓ అంకిత్ సందర్శించి విద్యార్థులకు సూచనలు, సలహాలను అందజేశారు.


స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తున్న సంతోష్


అల్లికలు నేర్పిస్తున్న ట్రైనర్

### నేడు సీఎం కప్ పోటీలు ప్రారంభం

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో నేడు(సోమవారం) సీఎం కప్ 2023 క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ నరిసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడిచర్ల జూనియర్ కళాశాల ఆవరణలో ఉదయం తొమ్మిది గంటలకు క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టేకుమట్ల/రేగొండ: ప్రతీ ఒక్కరు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకుంటూ, క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభిస్తున్నట్లు టేకుమట్ల, రేగొండ ఎంపీడీఓలు అనిత, సురేందర్ ఆదివారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. టేకుమట్ల మండల క్రీడాకారుల కోసం మండలంలోని వెలిశాల ఉన్నత పాఠశాల, రేగొండ మండల క్రీడాకారులు మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిభాపూలే పాఠశాలకు చేరుకోవాలని సూచించారు.